# బంచరాయి

ఆరేండొందల వరకు గడపలు వున్న ఆ వూళ్ళో ఎక్కువ మంది కూలి నాలి మీద ఆధారపడి బ్రతుకుతున్న వారే. నిజాముల పాలన ఎన్నో ఏండ్ల క్రితం అంతమైనా వాళ్ళ ప్రతిసిధులు రాంరెడ్డి పటేలు రంగారావు దొర ఇంకా బ్రతికే వున్నారు.

ఎంతో పెద్ద గుడిని కట్టించగలిగిన ఆ పెద్ద మనుషులు బడిని గురించి పట్టించుకోక పోవడంవల్ల ఆ వూరికి హైస్కూలు కూడ రాలేక పోయింది. అందుకనే ఆ వూరి బాలురు ఏడవ తరగతి కంటే ఎక్కువ చదవలేక పోతున్నారు. రావుగారి పిల్లలు, పటేలు పిల్లలు మాత్రమే పట్టణంలో చదువుతున్నారు.

రహదారి నుండి వూళ్లోకి రోడ్డు లేదు. బస్సు రాదు. ఉన్న బండ్లబాట కూడ సరిగలేని కారణాన ప్రభుత్వ అధికారులెవ్వరు ఆ వూరికి రానేరారు.

ప్రభుత్వం మిగులు భూములను హరిజనులకు పంచాలంటుంది. ఆ ఊళ్ళో ముప్పది ఎకరాల బంచరాయి రోడ్డు ప్రక్కమ్మటే వుంది. దాని మరో ప్రక్కన పడావు పడ్డ దేవాలయము, చుట్టూర తాటిచెట్లు. "ఆ భూమి దున్నుకుంటాము" అంటున్నారు ఆ గ్రామ హరిజనులు. "అబ్బె వీలులేదు" అంటున్నారు దొర, పటేలు, ఇతర భూస్వాములు.

"ఏదో ఓట్ల కోసం కాని, లేకపోతే వాళ్ళ కెందుకివ్వాలంట?" పటేలు.

"భూమినిస్తే ఓట్లు వేస్తారా! నీ పిచ్చిగాని, ఆ రోజు ఎవడు కల్లు సారకిస్తే వానికే!" దొర.

"అయినా బంగారంలాంటి ఈ భూమిని వాళ్ళకు ఇవ్వటం ఏమిటి, ఏ నవుల్లో చూపిస్తే పోలే" పటేలు.

"సౌళ్ళు లేవు వల్లకాదు లేదు అసలు వాళ్ళకు భూ మెందుకంటా? గొడ్డూ గోదా లేని సన్నాసులు, వాళ్లేమి పండించి చస్తారు? ఒక వేళ ప్రభుత్వం ఇచ్చినా ఎన్నాళ్ళు! మళ్ళీ ఏ నొప్పికో, ఏ రోగానికో లేదా పెళ్లికో కాకుంటే తాగుడుకో కుదువపెట్టరూ? ఆ తర్వాత తీసుకున్న డబ్బు కట్టలేక మనకు అందకట్టక మానరు"

బంచరాయి చెలకలో హరిజనులు చెట్టుకొడుతున్నారని తెలిసి ఆపడానికి వెళ్ళుతున్నారా మహానుభావులు. వారి వెనక ఊళ్ళో

జనాన్ని కులాల వారిగా లేపు కొస్తున్నాడు మస్కూరి మాదన్న.

"భూమిలేని పేదవాళ్ళకు మిగులు భూమిని పంచాలి! అనే కదా ప్రభుత్వం ప్రకటించింది! పేదవాళ్ళు అన్ని కులాలలోనూ వున్నారు. మరి వాళ్ళ మాటేమిటి? వీళ్లకు భూమి కావాలి–" రామిరెడ్డి చెప్తూ పోతున్నాడు. కంఠం హఠాత్తుగ ఆగి, రామిరెడ్డిని రెక్కపట్టి దగ్గర లాక్కొని "ఈ మాట అక్కడ వాళ్ళ ముందు అనేవుగట్ట. వాళ్లూ మాకు కావాలని కూర్చొంటారు"

"అందర్కి కాస్తకాస్త యిప్పిస్తే రేపు పంచాయితీ ఎన్నికల్లో నాకు తప్పక ఓటు వేస్తారూ అని–" రామిరెడ్డి.

"నీ ఓటు పాడుగాను! నీకు ఎన్ని ఓట్లు కావాలో నా మీద వదలిపెట్టు నేను చూసుకుంటా. ముందు ఈ భూమిని ఎవ్వరిపాలు కాకుండా చూడు. రోడ్డు ప్రక్కల భూమి. ముందు ముందు ధర పలుకుద్ది. రేపు మన పిల్లలకు ఏ ఉద్యోగము దొరకక్కపోతే, ఏదైనా ఇండస్ట్రి, ఆఖరికి ఓ కోళ్లఫారమైనా పెట్టొచ్చు లేదా కొన్నాళ్లాగి ప్లాట్స్ చేసి అమ్మితే పైసలే పైసలు" కర్ణం తన ప్లాను బయట పెట్టక తప్పలేదు.

"ఇదిగో రామిరెడ్డి! ఎన్నికల్లో నిన్ను గెలిపించే భారం నాది. ఈ విషయంలో మాత్రం నా మాట వినను! నేను అన్నీ చూసుకుంటా" "సరే పదా" అంటూ ఇద్దరూ బంచరాయి చెలక వైపు నడిచారు.

అప్పటివరకే ఇంటికో మనిషి చొప్పున దాదాపు అరవై మంది దాక హరిజనులు చెట్టు కొడుతున్నారు వాళ్ల పిల్లలు, ముసలి వాండ్లు అ చెత్తనంతా ఒక్కచోటికి చేరుస్తున్నారు. వాళ్ళ అద

వాళ్లు సద్ది గంపలతో వచ్చి, వాటిని గెట్ల మీద పెట్టి చెత్తకుప్ప లకు నిప్పంటిస్తున్నారు.

కరణం, రామిరెడ్డి ఇద్దరు గెట్టుచేరే సరికి మస్కూరి వూరంద రిని లేపుకొచ్చాడు. అందరు గెట్టుమీద నిలుచున్నారు. అంత వరకు చెత్తను కూడేస్తున్న మునలివాళ్ళు కరణానికి, రామిరెడ్డికి నెత్తిరుమాళ్లు తీసి దోసిలి పట్టుకొని వంగి దండం పెట్టారు.

"ఏం పాపిగా! ఎవరిని అడిగి ఈ భూమిలో చెట్టుగొడుతుంద్రురా!"

"అదేంది దొరా! అందరి కెరుకనాయె, రామిరెడ్డి పటేలుగూడ దున్నుకొమ్మనే!"

"మా గోపాల్– అదే రాజిగాని కొడుకు పట్నంలో హాస్టల్లో చదువుకుంటుండు. ఆడు తహశీలు దొరను అడిగి వచ్చిండట!" అందరిలోకెల్ల పెద్దవాడు మల్లయ్య నసిగాడు.

"పటేలు దున్నకొమ్మనడం, మీరు దున్నటం, మరి తహశీలు దారేమన్న పట్టా యిచ్చిండ? ముందు అందర్ని పని ఆపి ఇక్కడకు రమ్మను"

"మంచిది దొర! అరే టరి లింగయ్య, రంగయ్యా, లచ్చయ్య ఆప్రురి వాని పని ఆప్రురి. అందరు యిటు రాద్రి, దొర ఏదో చెప్తాడట" అని అందరిని పిలిచాడు మల్లయ్య.

అందరు వచ్చాక "ఏడి ఆ రాజిగాని కొడుకెక్కడ?" కరణం.

"ఆడు సమితి ప్రెసిడెంటును కలిస్తానని పోయిండు, యింకా రాలేదు" మల్లయ్య.

"ఆ ప్రెసిడెంటు ఖమ్మకీన్, ఈ వూర్నే అమ్మే బాపతు. ఆయన మీకేమి ఒదగ పెడతాద్రా సన్నాసుల్లార. రేపు ఎలక్షన్స్

వస్తున్నయని ఓ ఎత్తు వేశాడంటే" దొర

"అయినా తరతరాల నుండి ఈ గూడెంలో ఎప్పుడు సాలు పెట్టలేదు. కొంత్ర ఎయ్యను లేదు. ఇయ్యాల్ల మీరు గోసిపెట్టి నాగ్ర దీన్ని దున్నడానికి!"

కుడి చేత్తో దోతికొంగు పట్టుకుని ఎడమ చేతితో వాళ్ళను, భూమిని చూపిస్తూ, వెటకారం నిండిన గొంతుతో అంటున్నాడు దొర.

"మంత్రులొచ్చినప్పుడు ఏదో మాట్లాడుతుంటారు. మనవాళ్లు వాళ్ళ తోక పట్టుకుని గోదావరి ఈదుతాం అంటారు" రాంరెడ్డి.

"చెప్పరేమిరా- మీ వూరందరికి యిష్టమేనా పీళ్లు దీనిని దున్న కోవడానికి?" కరణం అందరిని గద్దిస్తూ ప్రశ్నించారు. నెత్తిన వున్న గొంగళిని సంకలోకి కూర్చుకొని; పొదగాటి కర్రను ఆస రాగ పెట్టుకొని "గొర్లు జీవాలు, అటు ఇటు తిరిగొచ్చి కాస్త నిలబడకుండ ఊరి ప్రక్కన వున్న ఈ కాసింత భూమిని మీరు దున్నుకుంటే ఎట్లెద్ది- మరి మేమెటుపోవాలె" అంటు అడిగాడు వూరి పెద్దగొల్ల బీరప్ప.

"అవును, అవును. ఈ మాట నిజం. పొలం తిరిగొచ్చి పశు వులు పొద్దుగూకంగ కాసింత సేపు నిలబడడానికి జాగలేకపోతే ఎట్లా?" అన్నారు రైతులు.

చాకలి చౌడుకోసం, కుమ్మరి మన్నుకోసం, ఊరన్నప్పుడు కొంత భూమన్న కాలిగా ఉండాలన్నాడు.

అప్పుడే వచ్చిన ఆ వూరి పూజారి.

"ఇక దేవాలయం ఎనాళ్లు అలా పాడుపడి వుంటుంది. దానికి

మోక్షం లేదా? ఎదో ఆ దేవుడి పేర ఈ భూమిని పట్టా చేయిస్తే ఎవరన్న మహానుభావులు సేద్యం చేసిపెడితే, గ్రామ ప్రజలు తరుఫున ఇంత దీపారాధన చెయ్యొచ్చు. ఈ విషయం గూడ కాస్త ఆలోచించండి" అని ఓ దమ్ము నశ్యం పీల్చి నశ్యం అంటిన వేళ్ల ఉత్తరీయానికి తుడుచుకొన్నాడు.

అన్నీ విన్న కరణం, పటేలు గుస గుస మాట్లాడుకొని "ఏది ఏమైనా పూజారి చెప్పినది వినదగ్గది. మన మందరం తగు ఏర్పాట్లు చెయ్యవల్సింది గూడ. ఏ మంటారు?" అందరి వైపూ చూస్తూ.

"మేము మాత్రం ఎలా కాదంటాము? దేవుడికి దీపారాధన వద్దంటామా?" అన్నారు అందరు.

హరిజనులు తప్ప మిగతా కులాలవాళ్లు అందరూ సరేనని, ఆ భూమిని దున్నవద్దని హరిజనులకు మరీ మరీ చెప్పి వెళ్లి పోయారు.

ఏం చేయాలో తట్టక కాలుతున్న కుప్పలను, వాటని ఎగేస్తున్న పిల్లలను చూస్తూ నిలుచున్నారు.

* *

హరిజనులు భూమిని దున్నారు.

హరిజనులు దున్నిన నాగలి చాలులో ఓ దేవుడి విగ్రహం బయటపడింది. ఆ విగ్రహం దగ్గర పూనకం వచ్చిన స్త్రీ కొల్పు చెప్పుతోంది. ఆమె చుట్టూరా జనం.

"ఈ భూమి దేవుడిది, అందుకని తరతరాల నుండి దీన్ని ఎవ్వరు ఆక్రమించిలేక పోయారు. ఒకవేళ ఎవ్వరైనా అలాంటి ప్రయత్నం చేస్తే దాని ఫలితం తీవ్రంగా వుంటుంది" అని

పూనకం వచ్చిన అమ్మవారు చెప్పింది. ఆ మాటలనే దొరగారు వూరంత చాటింపు చేయించాడు.

రకరకాల మాటల మధ్యా, అంతు పట్టని అనుమానాల మధ్యా ఆ దినం గడిచింది.

అర్థరాత్రి దాటినాక హరిజనవాడ తగలబడుతున్న మంటలు. తట్ట, బుట్ట, చంటిపిల్లల్ని చంకనెత్తుకొని, ముదుసలివాళ్ళ రెక్క పట్టుకుని గుడిసెల్లో నుండి బయటపడి, తమ సర్వస్వం మంటల పాలై పోతుంటే చూస్తూ ఏడుస్తున్నారు.

అన్నీ పూరి గుడిసిసెలే. అందరూ నిద్రనుండి లేచి, తాడు, బొక్కెన అనే లోపలినే మంటలు అంటుకున్నవి.

ఎన్ని ప్రయత్నాలు చేసినా మంటలేమీ అదుపులోకి రావటం లేదు

కోడిపిల్లలు, మేకపిల్లలు మొదలగు వాళ్ళ ఆస్తి అంతా క్షణంలో బూడిద అయింది. వూళ్లో వాళ్ళందరూ మంటల్ని ఆపే ప్రయత్నం ఎంతో చేశారు. కాని ఆపలేకపోయారు.

హరిజనవాడ పూర్తిగా తగలబడి పోయింది.

దొర, పటేలు కర్మ సిద్ధాంతాన్ని విప్పి చెప్పుతున్నారు. దేవుడి భూమిని, దేవతా విగ్రహాన్ని కదుల దున్నినందుకే హరిజనవాడ తగలబడ్డదని పూజారి అన్నప్పుడు "ఔను" అన్నాడు దొర "విన్న కొలువులో చెప్పినది నిజమైనది!" అన్నాడు పటేలు.

"కాదు_ అంతా అబద్దం" అని గోపాలం అరిచినప్పుడు జనం అంతా ఆతని చూపులవైపు, చూపుడువేలు వైపు చూస్తున్నారు.